# ఓ ఫెమినిస్ట్ డైరీ

తాతా రమేష్ బాబు



పురుష దౌష్ట్యాన్ని భరిస్తూ, మగవాడి లోపాల్ని సరిపెట్టుకోని, తమని తాము సమాధానపరచుకుంటూ సంసారం చేస్తున్నామనే భ్రమలో పాతివ్రత్యానికి లొంగిపోయి ఈ దేశంలో ఆడజాతి ఎంత బానిసత్వాన్ని అనుభవిస్తోంది?

సమాధానపడడం, సరిపెట్టుకోవడమనే రెండు మాటలతోనే ఆడదానికి నూరేళ్ళూ నిండిపోతున్నాయి. ఈ పరిస్థితులు మారాలి.

అందుకోసం ఏమైనా చేయాలి.

చేస్తాను. ఖచ్చితంగా ఏదో ఒకటి చేస్తాను.

* * *

స్త్రీ జనోద్ధరణ పేరుతో ఈ మగాళ్ళు పెద్ద సంఘ సంస్కర్తల్లా స్త్రీకి ప్రత్యేక హక్కులు ఇప్పిస్తామంటున్నారు!...

ప్రత్యేక హక్కులెందుకు? సమానహక్కులు కావాలని నేను వాదిస్తుంటే, ఈ ఆడవాళ్ళెవరూ ముందుకు రారేమిటి?...

వాళ్ళెప్పుడు ఈ ఉక్కు బంధాలు తెంపుకుంటారో?

వాళ్ళలోంచి ఈ బానిస భావాలు ఎప్పుడు పోతాయో?

* * *

స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, వ్యక్తిత్వం

స్త్రీకి కావలసినవి, అనుభవించవలసినవి ఈ మూడే.

వీటిని పోరాడి సాధించుకోవాలి.

ఈ పోరాటాల ముళ్ళ బాటలో పువ్వులా కన్పిస్తున్నాడు విజయ్.

ఎవరీ విజయ్?

ఎందుకితని గురించి నా మనసు ఆలోచిస్తోంది?

స్త్రీ స్వేచ్ఛనంగీకరించే వాడయినా సరే, మగవాడి సాహచర్యాన్ని ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించను.

సహజమయిన పురుషాహంకారం నరనరాల్లోనూ జీర్ణించుకుపోయి వుంటుంది మగాడిలో.

ఇదే నా నిర్ణయం...

* * *

విజయ్ కాలేజికి వచ్చిపోతూనే వున్నాడు, నా కోసం ఏదో ఒక వంకతో. నా తోటి లెక్చరర్లు ఇంత మాత్రానికే గుసగుసలు ప్రారంభించారు.

పిల్లను గురించిన భయం నాకు లేదుగానీ...

ఒక మగవాడితో నాకు స్నేహం ఏమిటి?

నాళ్ళ నెక్కడుంచాలో అక్కడుంచాలి.

మగవాడ్ని ద్వేషించే నేను ఇతనిని కూడా ద్వేషించి తీరాలి... ద్వేషిస్తాను.

* * *

"ఆర్థిక అసమానతల నీడ మానవ సంబంధాలపై ఖచ్చితంగా పడుతుందనీ, మానవ సంబంధాలు సజావుగా, స్వచ్ఛంగా వుండాలంటే ఆర్థిక అసమానతలు పోవాలనీ. అందుకు శ్రమ దోపిడి మీద పోరాటం చెయ్యాలనీ— ఈ రోజు మా కాలేజీలో విజయ్ ఉపన్యాసం దంచాడు.

ఈ కమ్యూనిస్టులు ఆర్థిక అసమానతల గురించి మాట్లాడతారే కాని...

స్త్రీ శ్రమ దోపిడి చేస్తున్న ఈ పురుషాధిక్యత గురించి మాట్లాడరేమిటి? ఇంట్లో పెళ్ళాలని వంట గది కప్పగించి రోడ్ల మీద శ్రమ పోరాటం చేస్తారు కాబోలు.

ఈ విజయ్ కూడా అలాంటివాడేనా?...

ఏమో?... పరిశీలించి చూస్తాను.

* * *

మగవాడ్ని ద్వేషించాలిగానీ... పరిశీలించడమేమిటి?

ఎందుకో విజయ్‌ను ద్వేషించలేకపోతున్నాను... పరిశీలించనూ లేకపోతున్నాను.

ఇతడి నుంచి దూరంగా వుండానికి ప్రయత్నం చేస్తాను.

* * *

"విశాలిగారూ, మీ ఆలోచన, ఆదర్శం, ఆకాంక్షలూ నన్నుత్తేజితుడ్ని చేస్తున్నాయి. మీతో కలసి ఈ వ్యవస్థపైన పోరాటం చేయాలనిపిస్తోంది. మీ జీవన సహచరుడుగా నన్నాహ్వానించగల్గితే... మనిద్దరం ఒకటవుదాం...", అన్నాడు విజయ్.

ఇదే మరో మగాడయితే, నా చేతిలో భంగపడేవాడే.

ఇతనికి నేను వెంటనే ఎందుకు సమాధానం చెప్పలేకపోయాను? నాలో అతని పట్ల ఏదో బలహీనత వుంది.

* * *

రోజూ సాయంకాలాలు విజయ్‌తో అభిప్రాయాలు పంచుకోడంతో గడచిపోతున్నాయి.

అతను చేస్తున్నది గుమస్తాగిరి అయినా ఆదర్శవంతుడే.

~~భేషజం లేనివాడుగానే కన్పిస్తున్నాడు.~~

అయినా మగవాడే కదా?...?

నా స్త్రీ సమానత్వాన్ని ఎంతవరకూ ఆమోదించగలడో కొంతవరకూ వేచి చూడాలి.

* * *

ఇతని ప్రేమ, సాత్కరింపు భ్రమల పులకరింపు కాకూడదనే నా ... అతని కోరికను మన్నించడానికే నేను నిర్ణయం తీసుకున్నాను.

'తాళి కట్టవద్దు' అన్నాను.

'నా మనసులో మాట చెప్పావు' అంటూ తలూపాడు.

'బంధు రాబందులను పిలవొద్దు' అన్నాను.

'ఆర్భాటాలు అసలొద్దు' అన్నాడు.

'ఇష్టమైన స్నేహితులను పిలచి తేనీటి విందు ఇద్దాం' — నేను

'ఈరోజే అపని చేద్దాం. నీ మిత్రులనూ, నా మిత్రులనూ ఇద్దరం కలసి పెళ్ళికి ఆహ్వానిద్దాం' — అతను.

'అలా కాదు, నీ స్నేహితులను నీవు పిలువు, నా స్నేహితులను నేను పిలుస్తా. అప్పుడు బావుంటుంది' — నేను.

'అలాగే' — అతను.

* * *

ఈ రోజు పెళ్ళి పార్టీలో కొత్త మిత్రుల పరిచయాలూ, అభినందనలూ స్పందన కలిగించాయి.

'ఆదర్శం, ఆచరణ మీ ఇద్దరి రూపంలో చూస్తున్నందుకు నాకు చాలా ఆనందంగా వుంది' — అన్న విజయ్ స్నేహితుడు డాక్టర్ రావ్ అభినందన నాకు చాలా ఆహ్లాదాన్ని కలిగించింది.

నిజమే... ఆదర్శం, ఆచరణ రెండూ వుంటేనే అనుకున్నది సాధించగలుగుతాము.

నా ఆచరణకు విజయ్ ఆదర్శం ఎంతవరకూ తోడ్పడుతుందో చూద్దాం.

* * *

జీవితాన్ని సహజంగా జీవించాలనే అభిప్రాయంతో కూడిన నా ఆలోచనా ధోరణి వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని విజయ్ భయపడుతుంటాడు. పరిస్థితులకు ఎడ్జస్ట్ అయి ఆశయానికి విరుద్ధంగా నడవాలనే తత్వానికి నేను వ్యతిరేకిని కదా...

'అసలు ఇలా సరిపెట్టుకోడం వల్లనే ఆడజాతి అన్యాయమైపోతోంది' — అని నేనంటే, 'అవును నిజమే' — అని అంగీకరించాడు విజయ్.

* * *

రాత్రిపూట విజయ్ తొందరపడుతున్నాడు.

నేను అప్పుడే అంగీకరించలేకపోతున్నాను. ఆ విషయమే చెప్పాను.

"ఇప్పుడే నా కిష్టం లేదు విజయ్. మనం ఎక్కువ కాలం కలసి పంచుకునే కొత్త జీవితం ఇది. మనం ఒకళ్ళనొకళ్ళం అర్థం చేసుకోవాల్సింది చాలా వుంది. ఇలా కొన్ని రోజులు గడుపుదాం. ఆ తరువాతనే..."



…న్నాను.

విజయ్‌కి నా మాటలు చాలా బాధ కలిగించే వుంటాయి. ఇంకా తనని నా జీవితంలోకి పూర్తిగా ఆహ్వానించలేదనే భావం ప్రవేశించి వుంటుంది.

పురుష ద్వేషంలోంచి, పురుష సహచర్యంలోకి ప్రవేశించిన నాకు, ఈ పరిస్థితులలో ఈ నిర్ణయాన్ని తీసుకోడం సబబే అనిపించింది.

అందుకే అతను బాధపడ్డ విషయాన్ని నేను పట్టించుకోదలచలేదు.

* * *

ఈ రోజు ఉదయం నిద్ర లేవగానే "రాత్రి కోపమొచ్చిందా విజయ్—" అనడిగాను. విజయ్ చిరు నవ్వు నవ్వాడు.

"ఇదీ ఒకందుకు మంచిదేలే… ఒకరితో ఒకరు అన్ని సందర్భాలలో హాయిగా వున్నప్పుడే నిజమైన సాహచర్యం అవుతుంది" అన్నాడు.

* * *

రోజులు మామూలుగా గడుస్తున్నాయి. నేను కాలేజికి, అతను ఆఫీసుకి.

అతను సీటుకి అంటుకుపోయే ఉద్యోగం.

పిల్లలకు పాఠాలు చెప్పి, విలువుకాళ్ళ జీతం తీసుకునే ఉద్యోగం నాది.

* * *

"నువ్వీ రోజు చాలా అందంగా వున్నావు విశాలీ! రాసిపోసిన అందాన్ని పక్కనే వుంచుకొని, నేనిలా ఎంత దహించుకుపోతున్నానో తెలుసా?… అసలు ఈ జన్మలో నన్ను ఆహ్వానిస్తావా విశాలా?" — అంటూ ఈ రోజు మతిభ్రమించినవాడిలా చాలాసేపు మాట్లాడాడు.

శరీరం, యవ్వనం, హోలీ ఆటల సరదాల సరదాలు, హరివిల్లులు లాంటి కృత్రిమ పదాలు, పిచ్చి కవిత్వాలు చాలా ఉపయోగించాడు. ఇంత మాత్రానికే అల్ప్రాల్ మగవాడికి లొంగిపోతే, పిచ్చిదద్దమ్మలకూ, నాకూ తేడా ఏమిటి?…

* * *

"ఏమిటి?… రోజూ వంట డ్యూటీ నా మీద వేస్తున్నావ్? రా… వచ్చి సాయం చెయ్…" గదమాయించాను ఈ రోజు విజయ్‌ని.

మనిషి కొంచెం ఖంగుతిన్నట్టే కన్పించాడు. కానీ తమాయించుకున్నాడు.

"విశాలీ ప్లీజ్, … ఈ వంట పని నాకు చాతకాదు, నన్నొదిలెయ్. నువ్వింకేపనయినా చెప్పు… చేస్తాను" అంటూ బతిమాలుకున్నాడు.

"అదేం కుదరదు, చేతకాదంటే ఎలాగ… నేన్నేర్పుతాను. వచ్చి నేర్చుకో…" అంటూ చెయ్యి పట్టుకుని వంట గదిలోకి లాక్కొచ్చాను. మొహం మాడ్చుకున్నాడు… పూర్ ఫెలో…

"ఎందుకొచ్చిన గొడవ… హోటల్లో భోంచేద్దాం, లేకపోతే వంట మనిషిని పెట్టుకుందాం" అంటూ గొణుగుతున్నాడు.

అంటే నేను కాకపోతే, ఇంకో ఆడదాన్ని ఇక్కడ బానిసగా వుంచాలని తనభిప్రాయమా?

అదేం కుదరదని చెప్పాను.

"సహజీవనమూ సహగమనమూ అంటే ఇదే మిస్టర్, గుర్తుంచుకో" హెచ్చరించాను.

విజయ్ ముంగిలా అయిపోయాడు.

మగవాడి అహంకారాన్ని లొంగదీయలేని నా ఈ వ్యక్తిత్వం ఎందుకు?…

రోజు మొత్తంలో ఏదో ఒక విషయం మీద విజయ్‌తో గట్టిగా మాట్లాడవలసి వస్తోంది.

నేను గట్టిగా మాట్లాడుతున్నానా?… లేక అతను రెచ్చగొడుతున్నాడా?…

అహంకారం పురుష సహజ లక్షణం కదా…?

* * *

రాత్రి పన్నెండు దాకా చదువుకోందే నాకు నిద్ర పట్టదు.

'గూట్లో దీపం, నోట్లో ముద్ద'లాగుంటాడు విజయ్.

అతనిది మొద్దు నిద్ర. పక్క గదిలోకి పోయి పడుకుంటాడు. పొద్దున్నే నిద్రలేస్తూనే , పాచి మొహంతో ఆ ఇకిలింపు మళ్ళీనూ.నాకు ఒళ్ళు మండుకొస్తోంది.

పెళ్ళికి ముందు ఆ నవ్వు ఇప్పుడు ఇకిలింపులా కన్పిస్తోంది.

విజయ్ ఇలా మారిపోతున్నాడేమిటి? నన్నర్థం చేసుకోకుండా నా శరీరాన్ని కోరే అర్హత ఇతనికి లేదు.

రోజు రోజుకీ, నా మనోభావాలలో అతను కురచనై పోతున్నాడు.

అతనిని అంగీకరించలేని స్థితి ఏదో ఒక రోజొస్తుం దేమోననే భయంగా వుంది.

పెళ్ళి తర్వాత నా స్వేచ్ఛ తరగిపోతోంది.

దీన్ని నేనంగీకరించను.

నాకు స్వేచ్ఛ కావాలి.

*　　*　　*

ఇవాళ విజయ్ ఆఫీసు కెళ్ళలేదు.

నేను ప్రతి విషయానికీ అంత కఠోరంగా ఎందు కుంటున్నానో అతనికి అర్థం కావట్లేదట. పొద్దున్నే గొడవ పెట్టుకున్నాడు.


నా వ్యక్తిత్వాన్ని గౌరవిస్తాడట కాని అంగీకరించ లేడట.

'అలాంటివాడివి నా వెంట ఎందుకు పడ్డావని నిల దీశాను.

నా వ్యక్తిత్వానికి ఒక వికాసం లేదని ఇంకో ఆరోపణ.

'అసలు నీకు వ్యక్తిత్వమే లేదని ఎదురుతిరిగాను.

"నువ్వు నన్ను పెళ్ళాంగా భావించుకుంటే చాలా పొర




పాటు పడతావు మిస్టర్, స్నేహితురాలిగా, స్వేచ్ఛా జీవిగా భావించుకో" అన్నాను.

*　　*　　*

ఈ రోజు లంచ్‌కి నే నింటికి రాలేదు.

నా కోసం కారియర్ తీసుకుని కాలేజీకి వచ్చాడు.

కాలేజిలో అతన్ని చూడగానే నాకు చిర్రెత్తు కొచ్చింది. నా కోసం కాలేజిలో 'అలా' అతన్ని చూడ గానే కొలీగ్స్ కిసుక్కున నవ్వారు.

ఆ నవ్వులో ఎన్ని అర్థాలు...

అసహనంగా లేచి వెయిటింగ్ రూమ్‌లో కెళ్ళాను. అడుగులో అడుగు వేసుకుంటూ భయం భయంగా నా వెనకాలే వచ్చాడు విజయ్.

"హిందీ సినిమా రంగం మళ్ళీ రొమాన్సుకు పట్టం కడ్తోందంటోయ్, ఏమైనా రొమాన్సు రొమాన్సే... ఎంత వద్దని భీష్మించుకు కూర్చొనే వాళ్ళకైనా ఈ రొమాన్సు... మనసులో దూరి, శరీరంలోకి వచ్చి ... లాలలాలలా... అంటుందిప్మా..."

స్టాఫ్ రూమ్‌లోంచి నవ్వులు, మాటలు, హేళన...

"నే నేమన్నా చిన్న పిల్లనా? ఎవరయినా పెడితేనే ఆకలయినట్టు తెలవకుండానే తినడానికి. ఈ పూట నాకాకలిగా లేదు కాబట్టి ఇంటికి రాలేదు. మర్యాద కోసమో, కంపెనీ కోసమో, ఎదురుచూస్తుంటారనో ఆకలి కాకపోయినా తినడం లాంటి చాదస్తాలు చేసి అనారోగ్యాన్ని తెచ్చుకోలేను. ఒక పూట ఫాస్టింగ్ చేస్తే శరీరానికన్యాడా మంచిదే. ఇలా ఒకరి కోసం ఒకరు బతుకుతున్నామనే కృత్రిమ వాతావరణం నా కిష్టం లేదు" అంటూ చివాట్లెట్టాను. నోరు మూసుకు వెళ్ళిపోయాడు.

సాయంత్రం అతను ఇంటికొచ్చేసరికి నేను భోజనం చేసేశాను. "రోజూ కలసి భోజనం చేసేవాళ్ళం, అలా మాట్లాడుకుంటూ తింటే బావుంటుంది. అస లప్పుడేగా మన విషయాలు మాట్లాడుకునేది మనం" అంటూ ఎంత గింజుకున్నాడు. అన్నం కూడా తిన కుండా పడుకున్నాడు.

ఏవో పిచ్చి ప్రేమలూ వికారాలూ వికృతాలతో మామూలు మనుషుల్లా 'ఇలా' ప్రవర్తించే వాళ్ళని చూస్తే నాకసహ్యం.

*　　*　　*

నేను లామా విజయ్‌తో జీవితాన్ని పంచుకోవడం చాలా కృతకంగా ఏదో తెచ్చిపెట్టుకొన్నట్టు కన్పిస్తోంది. ఇదిలాగే వుంటే భవిష్యత్తులో ఉత్తేజం మృగ్యమైపోతుం దని కూడా అన్పిస్తోంది.

జీవితమంతా ఇక్కడే తాకట్టు పెట్టుకున్నట్టు ఈ బతుకు చాలా దుర్భరంగా వుంది.

ఇప్పటిదాకా ఏ విలువల్ని నమ్మానో, ఏ స్వేచ్ఛ కోసం, ఏ విప్లవం కోసం నా జీవితాన్ని అంకితం చేసుకొన్నానో, ఆచరణకు సిద్ధం అయ్యానో, ఏ బాని సత్వాన్ని నిర్మూలించాలని కంకణం కట్టుకున్నానో, వాటినన్నింటినీ త్యాగం చేసి వంట గది ఇల్లాలుగా బతకాల్సిన అగత్యం నాకు లేదు.

పాతివ్రత్యం, పతి పాద ధూళి శిరసున దాల్చడం ఇందుకోసమా నేను పెళ్ళి చేసుకొంది?

అతను పైకి మాట్లాడేది అభ్యుదయమే కాని మనసు మాత్రం అందుకు భిన్నమైందే.

స్త్రీ సమానత్వాన్ని అంగీకరించే తత్వం అతనిది కాదనే నా అనుమానం నిజం కావచ్చు, కాకపోనూ వచ్చు.

ఏమో, నా కంతా గందరగోళంగా వుంది.

అసలు నేనెందుకు విజయ్‌ని ద్వేషిస్తున్నాను?

అతను బానిస కమ్మని పైకి అనలేదే?

కాని అతని మనసులో ఆ అభిప్రాయం వున్నట్టు నా కనుమానం.

దాదాపు ప్రతిరోజూ ఒక నరకాన్ని చూడవలసి వస్తే... ఎలా? నో...

ఈ అరాచకాన్ని ఇక్కడితో ఆపెయ్యాలి.

ఇదిలా జరగడానికి వీల్లేదు.

ఇలాంటి బానిస బతుకు బతకడం కన్నా చావడం మేలు —

ఛీ... ఆత్మహత్య చేసుకోడానికి నేనేమీ పిరికి పందను కాను.

ప్చ్... నా మీదే నాకు అసహ్యం, కోపం... జాలి...

నా మనసులో ఏదో వ్యాధి ప్రవేశించినట్టుంది.

చాలా భయంగా, బెంగగా వుంది.

మెదడులో నరాలు పగిలినట్టనిపిస్తోంది.

బుర్రలో అమీబా చొరబడి విచ్చలవిడిగా పాదాలు పరుచుకొంటున్న చప్పుడు నాకే విన్పిస్తోంది.

మనసులో వాయుగుండం రేపిన ఆలోచనా హోరు గాలి నాకు ఊపిరాడనియ్యడం లేదు.

గుండెలో ఏదో వికృత చిత్తరక్తం నన్ను చిత్ర హింసల పాలు చేస్తోంది.

నాకు తెలియకుండానే నేనేదో కోమాలోకి జారు కున్న వాస్తవ అనుభూతి.

ఏమిటి?... ఈ భయంకర అనుభూతి...

*　　*　　*

ఆ రోజు...

నా ప్రవర్తన, నా జీవం లేని చూపులు విజయ్‌కి చాలా ఆందోళన కలిగించి వుంటాయి.

నా చుట్టూ వున్న ప్రపంచంతో సంబంధాలు తెగిపోయినట్టు అచేతనంగా పడివున్న నన్ను చూసి కంగారుగా డాక్టర్ రావ్ దగ్గరకు వెళ్దామన్నాడు.

నేనుఔనని కానీ, కాదని కానీ అన్లేదు.

అతనే నా చేయి పట్టుకుని లేవదీసుకుంటూ రిక్షాలో హాస్పిటల్‌కు తీసుకువెళ్ళాడు.

డాక్టర్ రావ్ నన్ను పరీక్షించాడు.

ఏవేవేవిటో అడిగాడు. నేనేం చెప్పానో నాకు గుర్తులేదు.

బహుశా నేనతనికి కావలసిన సమాచారం ఇచ్చి వుండను.

ఆ క్షణాలలో నేను మెలకువలో వున్నానో, నిద్రలో వున్నానో నాకే తెలియదు. అసలు నేనెందుకలాగ అయ్యాను?

నేనలా అవడానికి విజయ్ కారణమా...?

డాక్టర్ రావ్, విజయ్‌లు మాట్లాడుకునే మాటలు నాకు లీలగానే విన్పిస్తున్నాయి.

"ఇప్పుడు నిశాలి ఒక విధమైన డిప్రెషన్‌లో వుంది విజయ్. ఆమెనీ రాత్రికిక్కడే వుంచు" అంటూ నా నరానికి ఇంజక్షన్ ఇచ్చాడు డాక్టర్ రావ్.

బహుశా అది మత్తు ఇంజక్షన్ అయివుంటుంది.

ఈ పురుష వ్యవస్థ మీద కక్షగట్టి వున్న నాపై ఆ మత్తు ప్రభావమేమీ వున్నట్టు లేదు. ఆ ఇంజక్షన్ నన్నేమీ చేయలేకపోయింది.

"విశాలి అలా ఎందుకయిపోయింది డాక్టర్" విజయ్ ఆదుర్దాగా అడుగుతున్నాడు.

"అనుకున్నది అనుకున్నట్టు జరగకపోవడం మూలాన, వాస్తవ పరిస్థితులకు ఎడ్జెస్ట్ అవ్వలేని మెంటాలిటీ తీవ్ర రూపం దాల్చినపుడు ఇలాంటి డిప్రెషన్‌కు లోనవుతారు. దీనినే మా భాషలో న్యూరోసిస్ అంటాం. ఇది ఆడవాళ్ళకు పిలిస్తే పలుకుతుంది. హిస్టీరియా ఆడవాళ్ళ సహజ లక్షణం కదా..."

హిస్టీరియా ఆడవాళ్ళ సహజ లక్షణమా?

"కానీ... డాక్టర్" అంటూ విజయ్ ఏదో చెప్పబోయాడు.

డాక్టర్ మధ్యలోనే అందుకుని, "విశాలి అందరు ఆడవాళ్ళలాంటిది కాదని, ఆమె ఒక వ్యక్తిత్వం కల మనిషనీ... నాకు తెలుసు. కానీ... ఆ వ్యక్తిత్వమే ఇప్పుడు గాయపడింది. ఇప్పుడు ఆవిడకి మానసిక స్థైర్యాన్ని కలిగించడం చాలా అవసరం. ఆవిడ సంఘర్షణ పడిన పరిస్థితులను వెంటనే మార్చివేయాలి. ఆవిడ మళ్ళీ మామూలు సమాజంలోకి రావాలంటే నీ సహకారం కావాలి..." అన్నాడు.

అప్పుడు విజయ్ ముఖ కవళికలు ఎలా వున్నాయో కళ్ళు తెరచి చూసే ఓపిక నాకు లేదు.

వాళ్ళ మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

అంత అనారోగ్యంలో కూడా 'మానవత్వం మానవత్వం' అంటూ గొంతు చించుకునే ఈ మనిషి డాక్టర్ మాటలకు ఏ సమాధానం చెప్తాడో చూద్దామని ఆ పరిస్థితుల్లో నాకూ అనిపించింది.

డాక్టరే అంటున్నాడు.

"నువ్వు చాలా త్యాగం చేయవలసి వుంటుంది విజయ్" అని.

మగవాళ్ళల్లో త్యాగం వుంటుందా?...

పురుషాహంకారం త్యాగాన్ని ఎందుకు అంగీకరిస్తుంది అనిపించింది నాకప్పుడు.

"ఆవిడ మామూలు మనిషి కావాలంటే, ఆమె జీవితం నుంచి నువ్వు తప్పుకోడం చాలా అవసరం" అంటున్నాడు డాక్టర్.

ఆ మాటలు వింటుంటే నాకువెయ్యేనుగుల బలాన్ని పొందినంత ఉత్తేజంగా అనిపించింది.

మగవాడే. అయినా ఈ డాక్టర్ నిజమైన మనిషి.

మగవాళ్ళల్లో కూడా మహానుభావులుంటారు కాబోలు.

బహుశా నా పెదాలపైన చిరునవ్వు విజయ్ గమనించకపోయినా డాక్టర్ గమనించే వుంటాడు.

గొంతు పెగుల్చుకొని విజయ్ మాట్లాడిన మాటలు నాకు స్పష్టంగానే వినిపించాయి.


"నేను రేపే హైదరాబాద్ వెళ్ళిపోతున్నాను. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేస్తున్నాను. ఇక ఎప్పుడూ విశాలికి మొహం చూపించను. విశాలిని మాత్రం మనిషిని చేయండి రావ్‌గారూ. సమాజంతో వ్యక్తులతో విరుద్ధంగా వుండడమే తన ఎదుగుదలకునిదర్శనంగా భావించుకునే అహంభావం ఎక్కువగా వున్న విశాలి నన్ను, ఎవరినీ కలుపుకోదేమో?... అరమరికలు లేని ప్రేమ, అనురాగం ద్వారా నిజమైన మానవసంబంధాలు ఏర్పడతాయని చెప్పండి. మనుషుల్లో ఆడవారే కాదు... మగవారు కూడా వుంటారని, వారికీ వ్యక్తిత్వం వుంటుందని, వ్యక్తిత్వానికి స్త్రీ పురుష లింగభేదం లేదని, పాలూ తేనెలా ఆ ఇద్దరి వ్యక్తిత్వాలూ కలిసినప్పుడే స్త్రీ పురుష సమానత్వం అనేదానికి అర్థం వుంటుందనీ... ఆమెకు తెలియచెయ్యండి డాక్టర్. మానవత్వం అంటే ఏమిటో ఆమెకు అర్థమయ్యేలా నేర్పండి సార్. మానవతా విలువల్ని మర్చిపోయి విచ్చలవిడితనాన్ని స్వేచ్ఛగా భావించుకునే ఈ ఆదర్శం... మానవ తిరోగమనానికే గాని, మానవ పురోగమనానికి తోడ్పడదని నేను మరింతగా నమ్ముతూ, ఆమె జీవితం నుంచి తప్పుకుంటున్నాను డాక్టర్... గుడ్‌బై..." అనేసి వెళ్ళిపోయాడు.

ఇంత జరిగాక కూడా ప్రేమ, అనురాగం పేరుతో అతని కాళ్ళ దగ్గర పడుండాలనే, స్త్రీ స్వేచ్ఛనుమనసారా ఆమోదించలేని, అతని వ్యక్తిత్వం పట్ల నాకు అసహ్యమే వేసింది గాని, ఏ మాత్రం గౌరవం కలగలేదు.

అతని నిష్క్రమణతో నా బానిస బంధాలు తెగిపోయినట్లనిపించింది.

* * *

నేను మామూలు మనిషిని కావడానికి కొంతకాలం పట్టింది. గత జీవితమంతా మర్చిపోదామనే ప్రయత్నం సఫలీకృతమైంది.




నా గతాన్నంతా మర్చిపోయాను.

ఈ రోజు డాక్టర్‌తో చెప్పాను.

"ఇప్పుడు నా ఆరోగ్యం కుదుటబడింది డాక్టర్ గారూ, మీరు చేసిన మేలు నేనెన్నటికీ మరువలేను. నా జీవితమంతా తపస్సు చేసి కోరుకున్న జీవితాన్ని నాకు ప్రసాదించారు. నేనిప్పుడు స్వేచ్ఛా జీవిని. సంపూర్ణ స్వేచ్ఛను అనుభవించగలుగుతున్నాను. థాంక్యూ డాక్టర్... థాంక్యూ వెరిమచ్."

డాక్టర్‌రావ్ నన్ను డిశ్చార్జి చేశారు.

ఆసుపత్రి నుంచి బయటపడ్డ నాకు ప్రకృతి అంతా పరవళ్ళు తొక్కుతున్నట్టు కన్పిస్తోంది.

పక్షులు రెక్కలు విప్పుకొని అనంతాకాశంలో హాయిగా, స్వేచ్ఛగా ఎగురుతున్నాయి.

నీరు స్వేచ్ఛగా ప్రవహిస్తోంది.

గాలి స్వేచ్ఛగా వీస్తోంది.

పువ్వులు స్వేచ్ఛగా విచ్చుకొంటున్నాయి.

కానీ... ఈ స్త్రీలు తమకు తామే సంకెళ్ళు వేసుకొంటున్నారు.

తాళి అనే గుదిబండ మెడలో వేయించుకొని తమని తాము సంసారాలకు బందీలు చేసుకొంటున్నారు.

మగవాడి అహంకారాన్ని, రాక్షసత్వాన్ని మీద వేసుకొని అణగారిపోతున్నారు.

ఈ స్త్రీ జాతినుద్ధరించడానికే నా ప్రయాణం.

ఈ లోకాన్ని మరమ్మతు చేయాలి.

ఈ పురుషాధిక్యతను కాలరాయాలి.

అప్పుడుగాని ఆడదానికి విముక్తి లేదు.

నా ఆశయ సాధనకు నేటి నుండే నడుం కట్టడానికి నిర్ణయించుకున్నాను.

ఈ నిర్ణయం మారదు.

* * *

డాక్టర్ నుంచి ఈ రోజు నాకు ఉత్తరం వచ్చింది.

స్త్రీ వ్యక్తిత్వాన్ని గౌరవించే ఏకైక పురుషుడిగా నేనభిమానించిన డాక్టర్ ఏమి రాశాడా అని ఆత్రంగా కవరు చించి చదివాను.

"విశాలిగారికి,

పురుష అహంకారంతో స్త్రీ స్వేచ్ఛకు ద్రోహం జరుగుతున్న సమాజంలో మీలాగా స్వతంత్రంగా ఆలోచించేవాళ్ళు కొద్దిమందైనారావడం నాకు చాలా ఆనందాన్ని కలిగించింది.

కానీ పురుషుడిలో వ్యతిరేకించే లక్షణాలనీ, ఆదర్శంగా తీసుకోవడం ద్వారా మీ ఉనికిని వెదజల్లుతున్నామనే వెర్రి తలలు వేస్తున్న మీ ధోరణినిముందు తరాల స్త్రీలు క్షమించరు.

మీరు కొత్తబాటకు నిర్దేశకులు. మీ నిర్దేశకత్వం వల్ల స్త్రీ అహంకారం జనించే పెడధోరణి వస్తుంది.

పురుష అహంకారాన్ని ఎంత వ్యతిరేకిస్తున్నామో, స్త్రీ అహంకారాన్ని కూడా అంతే ద్వేషించాలి.

మీ ఫెమినిస్టు భావాల పెడదారి నుంచి నా స్నేహితుడు విజయ్‌ని రక్షించి, అతని వ్యక్తిగత మానసిక వికాసాన్ని కాపాడాననే ఆత్మ సంతృప్తి నాకుంది.

బహుశా నా జీవితంలో నేను చేసిన మంచి పని, ఇంతకు మించింది మరొకటి లేదేమో...

స్త్రీ స్వేచ్ఛంటే అర్థం ఇది కాదని, స్వేచ్ఛకు పరమార్థం మానవత్వాన్ని పెంపొందించుకోవడమేనని నేననమ్ముతున్నాను.

దయచేసి మీ ఆదర్శంలో మానవతా విలువలు కలిగిన మానవ సంబంధాలను పెంపొందించుకోడం కూడా ఒక భాగంగాచేసుకోమని అర్థిస్తున్నాను..."

ఉత్తరం చదివాక నాకు మగాళ్ళ మీద ద్వేషం రెట్టింపయింది.

"ఛీ ... మగపశువులింతే.!"